క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిత్తూరు: నగరపాలక పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన కనీస సౌకర్యాలు ఉండాలని నగర కమిషనర్, ఏఈఆర్వో అరుణ చెప్పారు. ఎం.బండపల్లి ప్రాథమిక పాఠశాలలోని 51వ పోలింగ్ కేంద్రాన్ని కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో నీటి సరఫరా, విద్యుదీకరణ, మరుగుదొడ్లు, ర్యాంపుల నిర్మాణం, ఫర్నిచర్ సౌకర్యాలను పరిశీలించారు. నగరపాలక పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని, ఫోటోలతో సహా అందుబాటులో ఉన్న, లేని సౌకర్యాలపై నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, బీఎల్వోలు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

యాదమరి: మండల కేంద్రంలోని ప్రైవేటు కల్యాణమండపంలో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె మాజీ ఎంపీటీసీ రాధమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాధమ్మ మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్యకు రాధమ్మ అమ్మమ్మ అవుతుంది. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోళ్లహరిప్రసాద్, మధుసూదన్‌రాయల్ ఉన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్: టీచర్ల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు బుధవారం నగరంలోని వివేకనందా విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డీఏ, పీఆర్సీ వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో డీఎస్సీ నిర్వహించాలని చెప్పారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ చేపట్టాలన్నారు. ఈ ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు మునిరత్నం, ఎస్పీ బాషా పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని నారగల్లులో గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బీపీ, షుగర్, గర్భవతులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, కవిత, సుమతి, గీత, తామరై పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన

ఐరాల: మండలంలోని మామిడి రైతులకు గురువారం మామిడి తోటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కామినాయనపల్లె శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. మామిడిలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన మెలకువలు, సస్యరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

సరుకులు అందేలా చూడాలి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

యాదమరి: గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా వలంటీర్లు చూడాలని తహసీల్దార్ హనుమంతు కోరారు. మండలంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన యాదమరిలో పరిశీలించారు. ప్రతి లబ్ధిదారునికి రేషన్ సరుకులు అందాలని, ఈ కార్యక్రమాన్ని వలంటీర్లు దగ్గరుండి పంపిణీ చేయాలని సూచించారు. ఎవరైనా హాజరుకాకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపుతో విరిసిన ఆనందం





ఐరాల: వృద్ధుడికి పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ మోహన్, నాయకులు, పూతలపట్టు: లబ్ధిదారులకు పింఛన్ చెక్కును అందజేస్తున్న ఎంపీపీ కుమారి

ఐరాల: పెన్షన్ల పెంపుతో రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసిందని ఎంపీపీ మోహన్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన రూ.3000 పింఛన్లను నాయకులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పండుగ సాగుతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతేనే వారి స్థానంలో కొత్త పింఛన్ మంజూరు చేసే పరిస్థితి ఉండేదన్నారు. జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉంటేనే పింఛన్ వచ్చేదని గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మురళి, సురేంద్రయాదవ్, రాజేష్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

165 మందికి కొత్త పింఛన్లు

పూతలపట్టు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ కుమారి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గౌరి పింఛన్ల అధ్యక్షతన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో 165 మంది ఈ నెల నుంచి కొత్త పింఛన్లను అందుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని 8,530 మందికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.3000 పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో పాత పింఛనుదారుడు మరణిస్తేనే కొత్త పింఛను మంజూరు చేసేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మాసిలామణి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ విధానాలతో పనులు చేయించాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ బుధవారం ఉదయం నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ వాహనాల షెడ్డును పరిశీలించిన కమిషనర్ చెత్త తరలించే వాహనాలపై అధికారులతో చర్చించారు. చెత్త తరలించే వాహనాలకు సరిపడా డ్రైవర్లను సమకూర్చాలన్నారు. ఇందుకోసం డ్రైవింగ్ అర్హతలు ఉన్న డ్వాక్రా మహిళల భర్తలను డ్రైవర్లుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం చెత్త తరలించే వాహనాలకు డ్రైవర్లుగా వ్యవహరించారు. మరో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నరసింహ లోడర్ అవతారం ఎత్తారు. అనంతరం కమిషనర్ కట్టమంచి పరిధిలో లాయర్స్ కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో ఎక్కడా వ్యర్థాలు ఉండరాదని, నిర్దేశించుకున్న ప్రణాళిక ద్వారా అందుబాటులో ఉన్న రెగ్యులర్ వర్కర్లతో పారిశుధ్య నిర్వహణ పనులు చేయించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య నిర్వహణకు నగర ప్రజలు తమ వంతుగా సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్జీవో సంఘాలు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా పారిశుధ్య కార్మికులకు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని జానకార పల్లిలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బుధవారం ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. చిత్తూరు నగరం మురకంబట్టుకు చెందిన సతీష్‌కుమార్ మేలో గుండెకు శస్త్రచికిత్స చేస్తుండగా మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు ఆర్టీసీ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించి బాధితులకు అండగా నిలిచారు. బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.7లక్షల చెక్కును మృతుడి భార్య అరుణకు అందజేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ఆడపిల్లలను రక్షించండి అనే అంశంపై చిత్రలేఖన పోటీలు బుధవారం నిర్వహించారు. ఉదయం పాఠశాలలో ఎంఈఓ ప్రసాద్, హెచ్‌ఎం గిరిరాజ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఆడపిల్లలను రక్షించండి అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో తొమ్మిదో తరగతికి చెందిన చరణ్ ప్రథమ స్థానంలో, లోకేష్ రెండవ స్థానంలో, సోమశేఖర్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, దామోదరాచారి, మండలంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరమని వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పైమాఘం, దిగువమాఘంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. దిగువమాఘంలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పైమాఘంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు వేతనాల పెంపుతోపాటు సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. చిత్తూరు నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంల ఎదుట బుధవారం సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మణి, దాసరి చంద్ర, రమాదేవి, వాసు, సురేష్ పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీని నమ్మితే మునగడం గ్యారెంటీ

శాంతిపురం: ఓట్ల కోసం జిమ్మిక్కులు చేసే చంద్రబాబునాయుడు ఇస్తున్న బూటకపు ష్యూరిటీలను నమ్మితే ప్రజలు నిండా మునగడం గ్యారెంటీ అన్ని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. మండలంలో కొత్త పింఛన్లు, పెరిగిన పింఛన్లను బుధవారం మండల సచివాలయ మైదానంలో వారు పంపిణీ చేశారు. వీరు మాట్లాడుతూ, 2014లో 600 పైచిలుకు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కుర్చీ ఎక్కగానే హామీలను అటకెక్కించి, ప్రజలను దగా చేశారని విమర్శించారు. మళ్లీ ఎన్నికలు రాగానే కొత్త హామీలతో జనాన్ని ఏమార్చే ప్రయత్నం చేస్తున్నాడని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువ కల సాకారమైందన్నారు. ఈ కాలువ పనులు పూర్తి చేసి మరో 10 రోజుల్లో కుప్పం నియోజకవర్గానికి కృష్ణానది నీటిని అందిస్తోందన్నారు.

వివక్ష లేకుండా కుప్పానికి సంక్షేమం

గత ఎన్నికల్లో కుప్పం ప్రజలు తమ పార్టీని ఓడించినా ఎలాంటి వివక్ష లేకుండా ఒక్కో గ్రామ సచివాలయ పరిధిలో రూ.20 కోట్లకు మించిన సంక్షేమ ఫలాలను ఇక్కడి ప్రజలకు సీఎం అందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం-ఆంధ్రా



తవణంపల్లె హైస్కూల్లో క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తవణంపల్లె: మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని తవణంపల్లె, కృష్ణాపురం పాఠశాలల్లో క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ప్రారంభించారు. క్రీడాకారులకు పురుషులు, మహిళ విభాగంలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు.

గొప్ప దార్శనికురాలు సావిత్రిబాయి పూలే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు

బంగారుపాళెం: బాలికా విద్యకు పునాదులు వేసిన గొప్ప దార్శనికురాలు శ్రీమతి సావిత్రీ బాయిపూలే అని మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అన్నారు. మండంలోని మంగళపల్లెలో బుధవారం సావిత్రీబాయిపూలే 193 జయంతి(జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం)ని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు పూజలు నిర్వహించి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, సావిత్రీబాయిపూలే భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలని గుర్తు చేశారు. మహాత్మా జ్యోతీరావు పూలే భార్య సావిత్రీ బాయిని చదివించి ఉపాధ్యాయ వృత్తిలో చేర్పించారన్నారు. మహిళలు విద్యావంతులను చేయడంలో సావిత్రీ బాయిపూలే చేసిన కృషిని కొనియాడారు. యాదమరి మండలం గొల్లపల్లె పాఠశాల హెచ్‌ఎం లలిత మాట్లాడుతూ సావిత్రి బాయిపూలే జీవితాన్ని బాలికలు ఆదర్శంగా తీసుకుని విద్యావంతులుగా ఎదగాలన్నారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, సంజీవి, అరుణశివప్రసాద్, పిళ్లారప్ప, సంపంగి, మోహన్‌రెడ్డి, ధనశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరం



విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యాశాఖాధికారి

పూతలపట్టు: పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని, విద్యార్థులందరూ తప్పనిసరిగా తినాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. బుధవారం ఆకస్మికంగా పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మొదటగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి లోపం రాకుండా నాణ్యమైన సరుకులతో రుచికరమైన భోజనం పెడుతుందని తెలిపారు. కాని కొంత మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినకపోవడంతో వారికి అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూచి బాగుందని సిబ్బందిని అభినందించారు. అనంతరం తరగతులను పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు తప్పకుండా ప్రభు త్వం అందించిన బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతుండడంతో సమయాన్ని వృథా చేయకూడదని తెలిపారు. కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలు పేదలకు వరం



సురక్ష శిబిరంలో నగర మేయర్ అముద

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని నగర మేయర్ ఎస్ అముద అన్నారు. నగరపాలక పరిధిలో 11వ వార్డు సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. నగర కమిషనర్ అరుణ వైద్య శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగరపాలక పరిధిలో 11వ వార్డు సచివాలయం, 31వ వార్డు సచివాలయం పరిధిలో పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించి, పలువురికి మందులు, జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. సహాయ కమిషనర్ గోవర్ధన్ సీఎంఎం గోపి, స్థానిక కార్పొరేటర్లు, వైద్యాధికారులు, స్థానిక ప్రముఖులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- చలికాల వ్యాధులపై అప్రమత్తత అవసరం
- తగు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



చిత్తూరు రూరల్: ప్రస్తుతం చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం నుంచి ఉదయం వరకు జనం చలితో వణికిపోతున్నారు. ప్రజలను చలి వణికిస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచుకురుస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత వల్ల కళ్లాలకు వెళ్లే రైతులు, పేపర్ బాయ్‌ల ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. బైక్‌పై ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో కరోనాతో పాటు, చర్మ, గొంతు సంబంధిత వ్యాధులు సోకే ఆస్కారం ఉంది. చలికాలంలో ఏమాత్రం అలసత్వం వహించినా వ్యాధుల బారిన పడతారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా అప్రమత్తంగా ఉండాలి. చలిలో ఎక్కువగా తిరగడం, రక్షణ దుస్తులు ధరించకుండా ప్రయాణం చేసినా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

చర్మ వ్యాధులు సోకే ప్రమాదం

చలికాలంలో చర్మం పొడి బారిపోవడం, పాదాలు పగిలిపోవడం, పగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సమస్యలు వస్తాయి. చర్మం పొడిబారిపోవడం వల్ల దురదలు వస్తాయి. దురదకోసం గోకితే ఎగ్జిమా (చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్) వస్తుంది. సొరియాసిస్, ఇతియోసిస్ వంటి వ్యాధులు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. సొరియాసిస్ సోకినవారికి చేప పొట్టులా చర్మం రాలిపోతుంది. ఇతియాసిస్ సోకిన వారి చర్మం పొలుసు బారిపోతుంది.

బాధించే వ్యాధులు

చలికాలంలో వివిధ మాలధారణ చేసే భక్తులు రెండు పూటలా తలకు స్నానం చేస్తారు. దీని వల్ల చెవిలో దురదలు, ముక్కు కారడం, పొడి దగ్గు, అలర్జీ లక్షణాలతో పాటు చెవినొప్పి కూడా రావచ్చు. ముక్కునుంచి నీరు కారడం, తలనొప్పి, జ్వరం, దగ్గు, కఫం గొంతులోకి వెళ్లిపోవడం వంటివి బాధించవచ్చు. టాన్సిల్స్ ఎక్కువగా ఈ చలి కాలంలోనే కనిపిస్తాయి. మింగడం కష్టంగా ఉండడం, గొంతు నొప్పి, జ్వరం, దగ్గు వ్యాధి లక్షణాలు. దీనికి ప్రధానం చల్లని నీళ్లు, ఐస్ క్రీమ్స్, క్రూల్ డ్రింక్స్ జోలికెళ్లకూడదు. స్నానం చేసేటప్పుడు చెవిలోకి నీరు వెళ్లకుండా దూది పెట్టుకోవాలి. గోరు వెచ్చని నీళ్లు తాగాలి.

జ్వరం, చలి, దగ్గు, కఫం పడడం, రక్తం జీరలుగా రావడం న్యూమోనియో లక్షణాలు. ఆయాసం ఎక్కువగా రావడం, సాయత్రం, రాత్రి పూట పిల్లికూతలు రావడం ఆస్తమా వ్యాధి లక్షణాలు. ఇలాంటి లక్షణాలతో బాధపడేవారు క్రమం తప్పకుండా మందులు వాడాలి. కాలుష్యం ఉండే ప్రాంతాల్లో తిరగకూడదు. వీలైనంత త్వరగా నిద్రపోవాలి.

జాగ్రత్తలే శ్రీరామరక్ష



చలి కాలంలో తగిన జాగ్రత్తలతోనే ఇంటి బయట అడుగు పెట్టాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ముక్కు, చెవి, గొంతు వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీర్ఘకాలిక రోగులు మరింత జాగ్రత్తలు పాటించాలి. వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలి. చలి తీవ్రంగా ఉన్నప్పుడు వృద్ధులు, చిన్న పిల్లలు బయటకు రాకుండా జాగ్రత్త ఉండాలి.

–పురుషోత్తం, ఈఎన్‌టీ వైద్యులు

జాగ్రత్తలు తప్పనిసరి

- చలిలో సాయంత్రం 6గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బయట తిరగరాదు.
- చర్మం పొడి బారకుండా కొబ్బరి నూనె, వ్యాజ్‌లైన్ వంటివి రాసుకోవాలి.
- స్నానం చేసే ముందు కొబ్బరి నూనెతో మర్దన చేసుకుంటే మంచిది.
- ఉన్ని (ఉలన్) దుస్తులు ధరించడం, గ్లిజరిన్, అలోవెరా సబ్బులు వాడడం మంచిది.
- ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు కాళ్లు, చేతులు, మెడను కప్పుకునేలా సాక్సులు, గ్లౌజులు, హెల్మెట్ వంటివి ధరిస్తే మంచిది.

తీసుకోవాల్సిన ఆహారం

చలికాలంలో ఆకలి తక్కువగా ఉంటుంది. కాబట్టి తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఆకు కూరలు, కూరగాయలు తినాలి. పండ్లు ప్రతి రోజూ తీసుకోవాలి. టీ, కాఫీలు మాని వేసి మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటివి ఎక్కువగా తీసు కోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్, మసాలా ఫుడ్స్ తినకూడదు.

